

# అహోరకం ముచ్చట

"చిత్రంగా ఉందే.... ఒక్క నిముషం ఉండండి. కోటు జేబులో ఉందేమో చూస్తాను" అన్నాడు అప్పారావు తొట్రుపడుతూ.

"అబ్బే తొందరేం లేదు. తాపీగా చూడండి" అన్నాడు టిక్కెట్టు కలెక్టరు – ఖాళీగా ఉన్న మూడవ తరగతి పెట్టెలో కాళ్ళు బారజాచి కూర్చుంటూ.

అప్పారావు కోటు తడవడం మానేసి కిందనున్న పెట్టెను కొంచెం పక్కకి లాగాడు.

"ఏవండీ మీరు అహోరాత్రాలు రైళ్ళలోనే తిరుగుతూ ఉంటారు. టికెట్టు కొనుక్కుని కూడా రైల్లో బల్ల అడుగున దూరి ప్రయాణం చేసిన అసామీ కథ విన్నారా?" అన్నాడు.

"ఎవరండీ. గుర్తులేదే" అన్నాడు. టిక్కెట్టు కలెక్టరు సిగరెట్టు ముట్టిస్తూ.

"మహాద్భుతమైన కథలెండి. ఈ లైను లోనే జరిగింది. తెనాలి బెజవాడ స్టేషన్‌ల మధ్య. ఓ సుబ్బారావూ ఇంకో సింగారం తెనాలినించి బెజవాడ బయలుదేరారు. సుబ్బారావు టిక్కెట్లుకొని, హడావుడిగా ముందునడుస్తూ ఇదిగో టిక్కెట్లు మీ దగ్గరుంచండి అని సింగారానికి అందించాడు. గోచీ సర్దుకుంటూ ఆదరా బాదరా వెనకాల వస్తున్న సింగారం అందుకుని జేబులో పడేసుకున్నాడు" అని ఆగి కోటు జేబులో వెతకడం మొదలు పెట్టాడు. "చిత్రంగా ఉందే ఇక్కడ లేదు సుమండీ" అని ఆశ్చర్యం వెలిబుచ్చాడు.

"సరే కథ చెప్పండి."

"కథకేముంది. సుబ్బారావు అందిచ్చిన రెండు టిక్కెట్లయితే సింగారం అందుకున్నది ఒక్క టిక్కెట్టే. రైలు బైల్దేరాక వాళ్ళీ సంగతి తెలుసుకున్నారు. "రెండూ నీకే ఇచ్చా" నంటాడు సుబ్బారావు. కాదొక్కటే నంటాడు సింగారం. ఇంకోటి కొనడానికి ఇద్దరి దగ్గరా కూడా డబ్బులేదు. "నేనిచ్చిన డబ్బుకి నాకు

టిక్కెట్టిచ్చావు. ఆ పైన నాకేం తెలీదు" అంటూ అనేశాడు సింగారం. "అయితే నన్ను బల్ల కింద దూరమంటావా" అన్నాడు సుబ్బారావు బిక్కమొహం పెట్టి. "నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు సింగారం. "అతను మాత్రం ఏం చేస్తాడు చెప్పండి టిక్కెట్టు కలెక్టరుగారూ!" అన్నాడు అప్పారావు."

"మరే మరే. అంతే కదండి. తనకి మాలిన ధర్మం ఏముంది?" అన్నాడు టికెట్ కలెక్టరు.

"సరే, సింగారం బల్ల మీద కూర్చున్నాడు. టిక్కెట్టులేని సుబ్బారావు బల్లకింద దూరాడు. అంతలోకే పక్క పెట్లోంచి మీ వంటి అయనే ఒక టిక్కెట్ కలెక్టర్ వచ్చాడు. చాలా మంచివాడులెండి. అయినా ఈ సంగతి బల్లక్రింద పడుకున్న సుబ్బారావుకి తెలీదుగా. అసలే బల్లక్రింద నారింజ తొక్కలు, పిప్పి, చుట్టపీకెలు, బీడీ ముక్కలూ, పులిహోరలో మిరపకాయలు, ఎంగిలాకులు, వల్లకాడు, వశనపురం మొదలైనవి మోకాల్లోతున ఉన్నాయేమో సుబ్బారావు ఊపిరి సలపక ఉక్కిరి బిక్కిరైపోతున్నాడు."

"పాపం."

"అంతలో 'టికెట్ టికెట్' అనే భయంకరమైన మాటలు వినిపించాయి. టకటక మంటూ బూటుకాళ్ళు కనిపించాయి. సుబ్బారావు గుండె గుభేలుమంది...." అప్పారావు ఆగి, పరీక్షగా చూశాడు.

టికెట్ కలెక్టరు కళ్ళు రెపరెపలాడించి మందహాసం చేశాడు.

"సరే టిక్కెట్ కలెక్టర్ వచ్చి సింగారాన్ని టిక్కెట్ అడిగాడు. సింగారం బల్లకింద సుబ్బారావుని తలచుకొని కొంచెం కంగారుపడుతూ టికెట్ అందించాడు.... అప్పుడేమయింది తెలుసాండి?"

"తెలీదండీ"

"ఆ కంగారులో సింగారం అందివ్వబోయిన టిక్కెట్టు చేతిలోంచి జారిపోయింది.... సింగారం వంగిచూస్తే కనబడలేదు. లేచి నుంచుని పంచె కుచ్చిళ్ళు దులిపాడు" అన్నాడు అప్పారావు.

"అప్పుడేమయింది?"

"ఏమవుతుంది. సింగారం టిక్కెట్టుతోపాటు ఇంకో టిక్కెట్టు కూడా కింద పడింది. ఆ రెండోది కూడా మంచిదే. తెనాలిలో సుబ్బారావు అందిచ్చిన రెండు టిక్కెట్లలో అది రెండవదన్నమాట. జారిపడి సింగారం పంచె కుచ్చెళ్ళలో పాదాలమీద ఉన్న మడతలో తలదాచుకుంది"

"చిత్రంగా ఉందే" అన్నాడు టిక్కెట్ కలెక్టర్.

"ఆవేళ రైల్లో ఎక్కిన టిక్కెట్ కలెక్టర్ కూడా అదే మాట అన్నాడండి. రెండు టిక్కెట్లుచూసి రెండో అయన ఏడీ?" అడిగాడు.... "బల్లకింద పడుకున్నాడండి. అదో సరదా, అదో రకం ముచ్చట లెండి" అన్నాడు సింగారం సిగ్గుపడుతూ.

కథ విన్న టికెట్ కలెక్టరు కడుపుబ్బేలా, కణతలు ఎర్రబడేలా కంటనీరు తిరిగేవరకూ నవ్వాడు. నవ్వడం పూర్తి అయిపోయాక "సరే మీ టిక్కెట్ దొరికిందా" అని అడిగాడు గంభీరంగా.

అప్పారావు టికెట్ దొరకలేదు. ముచ్చెమటలు పోశాయి. జేబురుమాలు తీసి మొహం తుడుచుకోబోయేడు. అందులోంచి ఒక టిక్కెట్టు నేలరాలింది. 'అదిగో'

అన్నాడు అప్పారావు వంగి. ఆ వంగినవాడు అర నిమిషం వరకూ లేవలేదు. అర నిమిషం తరువాత నిటారుగా నిలబడి రెండు టిక్కెట్లు చూపించాడు. టిక్కెట్టు కలెక్టరు కళ్ళు విప్పార్చి చూశాడు అప్పారావు వంక.

"రెండోది నా పంచె కుచ్చెళ్ళలో ఉందండి.... మా నేస్తం...."

బల్లకింద పడుకున్న ఆ నేస్తం కిందపడున్న సిగరెట్ పీకతో చురకపెట్టాడు అప్పారావు కాలిమండ దగ్గిర. అప్పారావు కెవ్వుమన్నాడు.

* * *